"మధురమైన పిల్లలూ - విశ్వములోని ఆత్మలందరూ ఏమీ తెలియనివారిగా మరియు దుఃఖితులుగా ఉన్నారు, మీరు వారికి ఉపకారము చేయండి, తండ్రి పరిచయాన్ని ఇచ్చి సంతోషములోకి తీసుకురండి, వారి కళ్ళు తెరవండి"

ప్రశ్న:- ఏ సెంటర్ అయినా వృద్ధి చెందడానికి ఆధారము ఏమిటి?

జవాబు:- నిస్వార్థమైన సత్యమైన హృదయముతో చేసే సేవ. మీకు సేవ పట్ల సదా అభిరుచి ఉన్నట్లయితే హుండీ నిండుతూ ఉంటుంది. ఎక్కడైతే సేవ జరగగలదో, అక్కడ ఏర్పాట్లు చేయాలి. ఎవ్వరినీ అడగకూడదు. అడగడం కన్నా మరణించడం మేలు. అంతా దానంతటదే వస్తుంది. మీరు బయటివారి వలె చందాలు వసూలు చేయకూడదు. అడగడం వలన సెంటర్ వృద్ధి చెందదు, అందుకే అడగకుండా సెంటర్ ను నడిపించండి.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలు ఇక్కడ కూర్చున్నారు. ప్రారంభములో ఏ విధముగా మనము పై నుండి ఇక్కడకు వస్తాము అన్న జ్ఞానం బుద్ధిలో ఉంది. విష్ణు అవతరణ అనే నాటకం ఒకటి చూపిస్తారు. అందులో విమానంపై కూర్చొని కిందకు వస్తారు. అవతారాలు మొదలైనవాటినేవైతే చూపిస్తారో అవన్నీ అసత్యమైనవేనని ఇప్పుడు మీకు తెలుసు. ఆత్మలమైన మనము వాస్తవానికి ఎక్కడి నివాసులము, పై నుండి ఏ విధముగా ఇక్కడకు వస్తాము, ఏ విధముగా 84 జన్మల పాత్రను అభినయిస్తూ పతితులుగా అవుతాము అన్నది ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ తండ్రి పవిత్రముగా తయారుచేస్తారు. 84 జన్మల చక్రములో మేము ఏ విధముగా తిరుగుతాము అన్నది తప్పకుండా విద్యార్థులైన మీ బుద్ధిలో ఉండాలి. ఇది స్మృతిలో ఉండాలి. మీరు 84 జన్మలను ఏ విధముగా తీసుకుంటారు అన్నది తండ్రియే అర్థం చేయిస్తారు. కల్పము ఆయువుకు ఎక్కువ సమయమును ఇచ్చిన కారణముగా ఇంతటి సహజమైన విషయాన్ని కూడా మనుష్యులు అర్థం చేసుకోరు, అందుకే అంధవిశ్వాసము అని అనడం జరుగుతుంది. ఇతర ధర్మాలేవైతే ఉన్నాయో అవి ఏ విధముగా స్థాపన అవుతాయి అనేది కూడా మీ బుద్ధిలో ఉంది. పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ, పాత్రను అభినయిస్తూ-అభినయిస్తూ ఇప్పుడు ఇక చివరిలోకి వచ్చి చేరుకున్నామని మీకు తెలుసు. ఇప్పుడు మళ్ళీ తిరిగి వెళ్తారు. ఈ జ్ఞానము పిల్లలైన మీకే ఉంది. ప్రపంచములో ఇంకెవ్వరికీ ఈ జ్ఞానము తెలియదు. 5,000 సంవత్సరాల క్రితం స్వర్గము ఉండేది అని కూడా అంటారు. కానీ అది ఏమిటి అన్నది తెలియదు. తప్పకుండా ఆది సనాతన దేవీ-దేవతల రాజ్యం ఉండేది. కానీ అది ఏమాత్రమూ తెలియదు. మనకు కూడా ఇంతకుముందు ఏమీ తెలిసేది కాదని మీకు తెలుసు. ఇతర ధర్మాల వారు ఈ విధంగా తమ ధర్మ స్థాపకుల గురించి తెలియకుండా ఉండరు. మీరు ఇప్పుడు తెలుసుకొని నాలెడ్జ్ ఫుల్ గా అయ్యారు. మిగిలిన ప్రపంచమంతటికీ ఏమీ తెలియదు. మనం ఎంత వివేకవంతులుగా అయ్యాము, మళ్ళీ ఇప్పుడు వివేకహీనులుగా, ఏమీ తెలియనివారిగా అయిపోయాము. మనుష్యులై ఉండి లేక నటులై ఉండి కూడా మనకు ఈ విషయాలు ఇంతకుముందు తెలియవు. జ్ఞానము యొక్క ప్రభావము ఎలా ఉందో చూడండి! ఈ విషయాలు మీకే తెలుసు. కావున పిల్లలు లోలోపల ఎంతగా పులకరించిపోవాలి. ఎప్పుడైతే ధారణ జరుగుతుందో అప్పుడే లోపల ఆ సంతోషము కలుగుతుంది. మనం మొదట్లో ఏ విధముగా వచ్చామో, మళ్ళీ ఏ విధముగా శూద్ర కులము నుండి బ్రాహ్మణ కులములోకి ట్రాన్స్ఫర్ అయ్యామో మీకు తెలుసు. ఈ సృష్టి చక్రము ఎలా తిరుగుతుందో మీకు తప్ప ఈ ప్రపంచములో ఇంకెవ్వరికీ తెలియదు. లోలోపల ఈ జ్ఞాన నాట్యము జరుగుతూ ఉండాలి. బాబా మనకు ఎంత అద్భుతమైన జ్ఞానాన్ని ఇస్తారు, ఈ జ్ఞానము ద్వారా మనం మన వారసత్వాన్ని పొందుతాము. ఈ రాజయోగము ద్వారా నేను మిమ్మల్ని రాజులకే రాజులుగా తయారుచేస్తాను అని కూడా వ్రాయబడి ఉంది. కానీ ఏమీ అర్థమయ్యేది కాదు. ఇప్పుడు బుద్ధిలోకి మొత్తం రహస్యమంతా వచ్చింది. మనం శూద్రుల నుండి ఇప్పుడు బ్రాహ్మణులుగా అవుతాము. ఈ మంత్రము కూడా బుద్ధిలో ఉంది. మనమే బ్రాహ్మణులుగా, మళ్ళీ మనమే దేవతలుగా అవుతాము, మళ్ళీ మనమే దిగుతూ-దిగుతూ కిందకు వస్తాము. ఎంతగా పునర్జన్మలు తీసుకుంటూ చక్రములో తిరుగుతూ ఉంటాము. ఈ జ్ఞానము బుద్ధిలో ఉన్న కారణంగా సంతోషము కూడా ఉండాలి. ఇతరులకు కూడా ఈ జ్ఞానము ఎలా లభించాలి? ఎంతగా ఆలోచన నడుస్తూ ఉంటుంది. అందరికీ తండ్రి పరిచయాన్ని ఎలా ఇవ్వాలి? బ్రాహ్మణులైన మీరు ఎంత ఉపకారం చేస్తారు. తండ్రి కూడా ఉపకారం చేస్తారు కదా. ఎవరైతే పూర్తిగా ఏమీ తెలియనివారిగా ఉన్నారో, వారిని సదా సుఖవంతులుగా తయారుచేయాలి, వారి కళ్ళు తెరవాలి. సంతోషము కలుగుతుంది కదా. ఎవరికైతే సేవ అభిరుచి ఉంటుందో వారికి ఇది లోలోపల అనిపించాలి, ఎంతో సంతోషము ఉండాలి. ఆత్మలమైన మనం ఎక్కడ ఉండేవారము, మళ్ళీ పాత్రను అభినయించేందుకు ఎలా వస్తాము, ఎంత ఉన్నతముగా

అవుతాము, మళ్ళీ కిందకు ఎలా వస్తాము, మళ్ళీ రావణరాజ్యం ఎప్పుడు ప్రారంభమవుతుంది - ఇది మీ బుద్ధిలోకి వచ్చింది.

భక్తి మరియు జ్ఞానములో రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. భక్తిని మొదటి నుండి ఎవరు చేసారు? మొట్టమొదట మేమే వచ్చాము, కావున ఎంతో సుఖాన్ని చూశాము, ఆ తర్వాత మేమే భక్తిని చేయడం మొదలుపెట్టాము అని మీరు అంటారు. పూజ్యులు మరియు పూజారులలో ఎంతగా రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. మీ వద్ద ఇప్పుడు ఎంత జ్ఞానముంది. మరి సంతోషము కలగాలి కదా. మనం ఏ విధముగా 84 జన్మల చక్రములో తిరిగాము. 84 జన్మలెక్కడ, 84 లక్షల జన్మలెక్కడ! ఇంత చిన్న విషయం కూడా ఎవరి ధ్యాసలోకి రాదు. లక్షల సంవత్సరాలతో పోల్చి చూస్తే ఇవి ఒకటి, రెండు రోజులతో సమానమవుతాయి. మంచి-మంచి పిల్లల బుద్ధిలో ఈ చక్రము తిరుగుతూ ఉంటుంది, కావుననే వారిని స్వదర్శన చక్రధారులని అంటారు. సత్యయుగములో ఈ జ్ఞానం ఉండదు. స్వర్గానికి ఎంత మహిమ ఉంది. అక్కడ కేవలం భారత్ యే ఉండేది. ఏదైతే ఉండేదో అది మళ్ళీ తయారవ్వవలసిందే. బయటకు ఏమీ కనిపించదు. సాక్షాత్కారము జరుగుతుంది. ఈ పాత ప్రపంచము ఇప్పుడు అంతమవ్వనున్నదని, మళ్ళీ నంబరువారుగా మనం కొత్త ప్రపంచములోకి వస్తామని మీకు తెలుసు. ఆత్మలు పాత్రను అభినయించడానికి ఎలా వస్తాయి అనేది కూడా మీరు అర్థం చేసుకున్నారు. నాటకములో చూపించినట్లుగా ఆత్మలేమీ పై నుండి అవతరించవు. ఆత్మలను ఎవ్వరూ ఈ కనుల ద్వారా చూడలేరు కూడా. ఆత్మ ఏ విధముగా వస్తుంది, చిన్న శరీరములోకి ఏ విధముగా ప్రవేశిస్తుంది, అది చాలా అద్భుతమైన ఆట. ఇది ఈశ్వరీయ చదువు. ఇందులో రాత్రింబవళ్ళు చింతన జరగాలి. మనం ఒకసారి అర్థం చేసుకుంటాము అనగా దానిని చూస్తాము, ఆ తర్వాత ఇక వర్ణన చేస్తాము. ఇంతకుముందు ఇంద్రజాలికులు ఎన్నో వస్తువులను తీసి చూపించేవారు. తండ్రిని కూడా ఇంద్రజాలికుడు, వ్యాపారి, రత్నాకరుడు అని అంటారు కదా. ఆత్మలోనే జ్ఞానమంతా నిలుస్తుంది. ఆత్మయే జ్ఞానసాగరముగా ఉంటుంది. పరమాత్మ జ్ఞానసాగరుడు అని అంటారు కానీ వారు ఎవరు, ఏ విధముగా ఇంద్రజాలికుడు అన్నది ఎవ్వరికీ తెలియదు. ఇంతకుముందు మీరు కూడా అర్థం చేసుకునేవారు కాదు. ఇప్పుడు తండ్రి వచ్చి దేవతలుగా తయారుచేస్తారు. లోలోపల ఎంతటి సంతోషము ఉండాలి. ఒక్క తండ్రే నాలెడ్జ్ ఫుల్, వారు మనల్ని చదివిస్తారు కూడా. ఇది కేవలం పిల్లలైన మీకే తెలుసు. రాత్రింబవళ్ళు లోలోపల ఈ స్మరణ జరుగుతూ ఉండాలి. ఈ అనంతమైన నాటకము యొక్క జ్ఞానాన్ని ఒక్క తండ్రే వినిపించగలరు, దీనిని ఇంకెవ్వరూ వినిపించలేరు. బాబా ఏమైనా చూసారా, అయినా కానీ వారిలో మొత్తం జ్ఞానమంతా ఉంది. తండ్రి అంటారు, నేను సత్య, త్రేతాయుగాలలోనైతే రాను, కానీ మొత్తం జ్ఞానమంతటినీ వినిపిస్తాను. ఆశ్చర్యం అనిపిస్తుంది కదా. ఎవరైతే ఎప్పుడూ పాత్రనే తీసుకోలేదో వారు ఎలా తెలియజేస్తున్నారు! తండ్రి అంటారు, నేను ఏమీ చూడను, అలాగే నేను సత్య, త్రేతాయుగాలలోకి రాను, కానీ నాలో జ్ఞానం ఎంత చక్కగా ఉందంటే, నేను ఒకేసారి వచ్చి, మీకు అదంతా వినిపిస్తాను. మీరు పాత్రను అభినయించారు, కానీ మీకు ఏమీ తెలియదు మరియు ఎవరైతే పాత్రను అభినయించనే లేదో వారు అంతా వినిపిస్తారు - ఇది అద్భుతం కదా. పాత్రధారులమైన మనకు ఏమీ తెలియదు కానీ తండ్రిలో ఎంతటి జ్ఞానమంతా ఉంది. తండ్రి అంటారు, నేను మీకు అనుభవాన్ని వినిపించేందుకు నేనేమైనా సత్య, త్రేతాయుగాలలోకి వస్తానా. డ్రామానుసారంగా ఏమీ చూడకుండానే, అనుభవం చేయకుండానే, మొత్తం జ్ఞానమంతటినీ ఇస్తారు. ఇది ఎంత అద్భుతము - నేను పాత్రను అభినయించేందుకు రానే రాను కానీ మీకు మొత్తం పాత్రనంతటినీ అర్థం చేయిస్తాను, అందుకే నన్ను నాలెడ్జ్ ఫుల్ అని అంటారు.

తండ్రి అంటారు, ఇప్పుడు మధురాతి మధురమైన పిల్లలు తమ ఉన్నతిని చేసుకోవాలి కావున స్వయాన్ని ఆత్మగా భావించండి. ఇది ఒక ఆట. మీరు మళ్ళీ ఇదే విధమైన ఆటను ఆడతారు, దేవీ-దేవతలుగా అవుతారు. మళ్ళీ అంతిమంలో చక్రము చుట్టి వచ్చి మనుష్యులుగా అవుతారు. బాబాలో ఈ జ్ఞానం ఎక్కడి నుండి వచ్చింది అని ఆశ్చర్యపోవాలి కదా. వారికైతే గురువు కూడా ఎవ్వరూ లేరు. డ్రామానుసారంగా ముందు నుండే వారిలో పాత్రను అభినయించాలని అంతా రచింపబడి ఉంది. దీనిని సృష్టి అద్భుతమని అంటారు కదా. ప్రతి విషయము అద్భుతమైనది. కావున తండ్రి కూర్చొని కొత్త-కొత్త విషయాలను అర్థం చేయిస్తారు. ఇటువంటి తండ్రిని ఎంతగా స్మృతి చేయాలి. 84 జన్మల చక్రాన్ని కూడా స్మృతి చేయాలి. ఈ రహస్యాన్ని కూడా బాబాయే అర్థం చేయించారు. విరాట రూప చిత్రము ఎంత బాగుంది. ఏ లక్ష్మీ-నారాయణుల లేక విష్ణువు చిత్రాన్ని తయారుచేస్తారో, వారే తాము ఏ విధంగా 84 జన్మలలోకి వస్తారు అనేది చూపిస్తారు. మనమే దేవతలుగా, మళ్ళీ మనమే క్షత్రియులుగా, వైశ్యులుగా, మళ్ళీ శూద్రులుగా అవుతాము. ఇది స్మరణ చేయడంలో ఏమైనా కష్టముందా? తండ్రి నాలెడ్జ్ ఫుల్. వారు ఎవరి నుండీ చదువుకోలేదు, అలాగే శాస్త్రాలూ మొదలైనవేవీ కూడా చదవలేదు. ఏమీ చదవకుండానే, ఏ గురువుల వద్దకూ వెళ్ళకుండానే మొత్తం

జ్ఞానమంతటినీ కూర్చొని వినిపిస్తారు - ఈ విధంగా ఎప్పుడూ చూడలేదు. తండ్రి ఎంత మధురమైనవారు. భక్తి మార్గంలో ఒక్కొక్కరూ ఒక్కొక్కరిని మధురమైనవారిగా భావిస్తారు. ఎవరికి ఎవరు అనిపిస్తే వారిని పూజించడం మొదలుపెడతారు. బాబా కూర్చొని అన్ని రహస్యాలనూ అర్థం చేయిస్తారు. ఆత్మయే ఆనంద స్వరూపము, మళ్ళీ ఆత్మయే దుఃఖ రూపముగా, అశుద్ధముగా అయిపోతుంది. భక్తి మార్గములో మీకు ఏమీ తెలిసేది కాదు. నన్ను ఎంతగా మహిమ చేస్తారు కానీ ఏమీ తెలియదు. ఇది కూడా ఎంత అద్భుతమైన ఆట. ఈ ఆటనంతటినీ బాబా అర్థం చేయించారు. మెట్ల చిత్రము మొదలైన ఇన్ని చిత్రాలను ఎప్పుడూ చూడలేదు కూడా. ఇప్పుడు చూస్తారు మరియు వింటారు కావున ఈ జ్ఞానం యథార్థ రీతిగా ఉందని అంటారు కూడా. కానీ కామము మహాశత్రువు, దానిపై విజయాన్ని పొందాలి అని అంటే, అది విని చల్లబడిపోతారు. మీరు ఎంతగా అర్థం చేయిస్తారు, అయినా కానీ అర్థమే చేసుకోరు. ఎంత శ్రమించవలసి ఉంటుంది. కల్పపూర్వము ఎవరైతే అర్థం చేసుకున్నారో, వారే అర్థం చేసుకుంటారని కూడా తెలుసు. దైవీ పరివారం వారు ఎంతమంది అయితే తయారవ్వవలసి ఉంటుందో వారికే ఇవి ధారణ అవుతాయి. మనం శ్రీమతంపై రాజధానిని స్థాపన చేస్తున్నామని మీకు తెలుసు. ఇతరులను కూడా మీ సమానముగా తయారుచేయండి అని తండ్రి ఆజ్ఞను ఇచ్చారు. తండ్రి ఈ జ్ఞానమంతటినీ వినిపిస్తున్నారు. మీరు కూడా వినిపిస్తున్నారు. కావున తప్పకుండా ఈ శివబాబా రథము కూడా వినిపించగలరు కదా. కానీ వారు స్వయాన్ని గుప్తము చేసుకుంటారు. మీరు శివబాబానే స్మృతి చేస్తూ ఉండండి. వీరినైతే మహిమ కూడా చేయకూడదు. సర్వుల సద్గతిదాత, మాయ సంకెళ్ళ నుండి విడిపించేవారు ఒక్కరే.

తండ్రి ఏ విధముగా కూర్చుని మీకు అర్థం చేయిస్తారు - ఇది పిల్లలైన మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియనే తెలియదు. రావణుడు ఎవరు అన్నది కూడా మనుష్యులకు తెలియదు. ప్రతి సంవత్సరమూ కాలుస్తూనే ఉంటారు. దిష్టిబొమ్మ అనేది శత్రువుదే తయారుచేయడం జరుగుతుంది కదా. రావణుడు భారత్ కు శత్రువని, అతను భారత్ ను ఎంతో దుఃఖితముగా, నిరుపేదగా చేసాడని ఇప్పుడు మీకు తెలిసింది. అందరూ పంచ వికారాల రూపీ రావణుని పంజాలో చిక్కుకొని ఉన్నారు. ఇతరులను కూడా రావణుడి నుండి ఎలా విడిపించాలి అని పిల్లలకు లోలోపల అనిపించాలి. సేవ జరిగే అవకాశము ఉంటే ఏర్పాట్లు చేయాలి. సత్యమైన హృదయముతో, నిస్వార్థ భావముతో సేవ చేయాలి. బాబా అంటారు, అటువంటి పిల్లల హుండీని నేను నింపుతాను. ఇది డ్రామాలో నిశ్చితమై ఉంది. సేవ చేసే మంచి అవకాశం ఉంటే అందులో అడగవలసిన అవసరం కూడా ఉండదు. సేవ చేస్తూ ఉండండని తండ్రి చెప్పేసారు కదా. కానీ ఎవరి నుండి ఏమీ అడగకండి. అడగడం కన్నా మరణించడం మేలు. దానంతటదే మీ వద్దకు వచ్చేస్తుంది. అలా అడగడం వలన సెంటరు అంతగా వృద్ధి చెందదు. ఏమీ అడక్కుండానే మీరు సెంటరును నడిపించండి, దానంతటదే అంతా వస్తూ ఉంటుంది, అందులో శక్తి ఉంటుంది. ఏ విధముగా బయటివారు చందాలు పోగు చేస్తారో, మీరు అలా చేయకూడదు.

మనుష్యులను ఎప్పుడూ భగవంతుడని అనరు. జ్ఞానము బీజము వంటిది. బీజరూపుడైన తండ్రి కూర్చొని మీకు జ్ఞానాన్నిస్తారు. బీజమే నాలెడ్జ్ ఫుల్ కదా. ఆ జడ బీజమైతే వర్ణన చేయలేదు. మీరు వర్ణన చేస్తారు. మీరు అన్ని విషయాలను అర్థం చేసుకోగలరు. ఈ అనంతమైన వృక్షము గురించి ఎవ్వరూ అర్థం చేసుకోరు. అనన్యులైన పిల్లలైన మీకు తెలుసు, నంబరువారు పురుషార్థానుసారంగా. మాయ కూడా శక్తివంతమైనదని తండ్రి అర్థం చేయిస్తారు. కొంత సహించవలసి ఉంటుంది కూడా. ఎంత కఠినమైన వికారాలు ఉన్నాయి. మంచి-మంచి సేవ చేసేవారికి కూడా నడుస్తూ-నడుస్తూ ఈ విధముగా మాయ చెంపదెబ్బ తగులుతుంది, మేమైతే పడిపోయామే అని అంటారు. మెట్లను పైకి ఎక్కుతూ-ఎక్కుతూ కింద పడిపోతారు, అప్పుడు చేసుకున్న సంపాదనంతా అంతమైపోతుంది. దండన అయితే తప్పకుండా లభించాలి. తండ్రితో ప్రతిజ్ఞ చేస్తారు, రక్తంతో కూడా రాసి ఇచ్చారు, అయినా కానీ మాయమైపోయారు. బాబా పక్కా చేయడానికి చూస్తారు కూడా, ఇన్ని యుక్తులను చేస్తున్నా కూడా మళ్ళీ ప్రపంచం వైపుకు వెళ్ళిపోతారు. ఎంత సహజముగా అర్థం చేయిస్తారు, పాత్రధారులు తమ పాత్రనే స్మరిస్తూ ఉండాలి. తమ పాత్రను ఎవరైనా మర్చిపోగలరా? తండ్రి అయితే ప్రతి రోజు రకరకాలుగా అర్థం చేయిస్తూ ఉంటారు. మీరు కూడా ఎంతోమందికి అర్థం చేయిస్తారు, అయినా కానీ మేము బాబాకు సమ్ముఖంగా వెళ్ళాలి అని అంటారు. తండ్రిదైతే అద్భుతము. వారు రోజు మురళిని వినిపిస్తారు. వారు నిరాకారుడు. వారికి నామ, రూప, దేశ, కాలాలైతే లేవు. మరి మురళిని ఎలా వినిపిస్తారు అని ఆశ్చర్యపోతారు. మళ్ళీ పక్కా అయి వస్తారు. ఇటువంటి తండ్రి వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు, వారిని కలుసుకోవాలి అని మనసు కలుగుతుంది. ఈ పరిచయముతో వచ్చి కలుసుకున్నట్లయితే తండ్రి నుండి జ్ఞాన రత్నాలను ధారణ చేయగలుగుతారు, శ్రీమతాన్ని పాలన చేయగలుగుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞానాన్ని జీవితంలో ధారణ చేసి సంతోషంలో పులకరించిపోవాలి. అద్భుతమైన జ్ఞానాన్ని మరియు జ్ఞానదాతను స్మరిస్తూ జ్ఞాన డ్యాన్స్ చేయాలి.

2. మీ పాత్రను మాత్రమే స్మరించాలి, ఇతరుల పాత్రను చూడకూడదు. మాయ చాలా శక్తివంతమైనది, అందుకే జాగ్రత్తగా ఉండాలి. మీ ఉన్నతిలో నిమగ్నమై ఉండండి. సేవ పట్ల అభిరుచి కలిగి ఉండండి.

వరదానము:- మంచితనంపై ప్రభావితులయ్యేందుకు బదులుగా దానిని స్వయంలో ధారణ చేసే పరమాత్మ స్నేహీ భవ

ఒకవేళ పరమాత్మ స్నేహీగా అవ్వాలంటే దేహాభిమానపు ఆటంకాలను చెక్ చేసుకోండి. వీరు చాలా మంచివారు, అందుకే కాస్త దయ కలుగుతుంది... అని కొంతమంది పిల్లలు అంటారు. కొందరికి కొందరి శరీరాల పట్ల మోహం కలుగుతుంది, కొందరికి కొందరి గుణాలు లేక విశేషతల పట్ల మోహం కలుగుతుంది. కానీ ఆ విశేషతను లేక గుణాన్ని ఇచ్చింది ఎవరు? ఎవరైనా మంచిగా ఉంటే, ఆ మంచితనాన్ని ధారణ చెయ్యండే కానీ ఆ మంచితనానికి ప్రభావితులవ్వకండి. అతీతంగా మరియు తండ్రికి ప్రియంగా అవ్వండి. అటువంటి ప్రియమైనవారు అనగా పరమాత్మ స్నేహీ పిల్లలు సదా సురక్షితంగా ఉంటారు.

స్లోగన్:- సైలెన్స్ శక్తిని ఇమర్జ్ చేసినట్లయితే సేవ యొక్క వేగం తీవ్రతరం అవుతుంది.